ఓటింగ్ యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

## ఈవీఎంల మొదటి దశ చెకింగ్ పూర్తి

సూర్యాపేట, ఫిబ్రవరి 14 : జిల్లాలోని ఈవీఎం గోదాంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మొదటి దశ చెకింగ్ పూర్తి అయిందని అదనపు కలెక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం ఓటింగ్ యంత్రాల చెకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కోసం బ్యాలెట్ యూనిట్లు 2,803, కంట్రోల్ యూనిట్లు 1,742, వీవీ ప్యాడ్లు 1,848ను మొదటి లెవల్ చెకింగ్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు పాల్గొన్నారు.

**ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు అందించాలి**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులు అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివిధ శాఖల ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. అనంతరం వారు ఆయా శాఖలలో బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో జడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష ఉన్నారు.

# ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పెంపు

- మార్చి 31 చివరి తేది

పాలకవీడు, ఫిబ్రవరి 14 : 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన రెన్యువల్, ఫ్రెషర్ విద్యార్థులకు ఉపకార వేతనాల దరఖాస్తు ప్రకియ కొనసాగుతున్నది. తొలుత దరఖాస్తు గడువు అక్టోబర్ 30 వరకు ఉండేది. ఫ్రెషర్, రెన్యువల్ విద్యార్థులకు దరకాస్తు ప్రక్రియపై అవగాహన లేకపోవడం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల బాధ్యులు, ఆయా సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థులను సరిగ్గా ప్రేరేపించకపోవడం, విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్లు తీసుకోకపోవడంతో దరకాస్తుల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం రెండోసారి 2024 జనవరి 31 వరకు గడువు పొడిగించింది. అయినా దరఖాస్తుల ప్రక్రియ అనుకున్న రీతిలో జరుగకపోవడంతో గడువు తేదీని తిరిగి మార్చి 31 వరకు పొడిగించింది.

**సూర్యాపేట జిల్లాలో ఫ్రెషర్స్ దరఖాస్తులు**

జిల్లాలో ఫ్రెషర్స్ ఉపకార వేతనాలకు ఈ నెల 14 వరకు కేవలం 9,674 మంది మాత్రమే దరకాస్తు చేసుకున్నారు. ఎస్సీ విభాగంలో 2,266 మంది, ఎస్టీలు 1,636 , బీసీలు 4,928 మంది, ఈబీసీ 223, మైనార్టీలు 620 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**నల్లగొండ జిల్లాలో..**

2023-24 విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లాలో అన్ని విభాగాల్లో రెన్యువల్ విద్యార్థులు 22,284 దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, ఫిబ్రవరి 14 వరకు 15,042 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఎస్సీ విభాగంలో 5,212 మందికి గాను 4,003 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీల్లో 3,081 మందికి 2,342 మంది, బీసీ సంక్షే మ శాఖలో 12,113 గాను 8,553 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 7,242 మంది రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్నది.

**నల్లగొండ జిల్లాలో ఫ్రెషర్స్ విద్యార్థుల దరఖాస్తులు**

జిల్లాలో ఫ్రెషర్స్ ఉపకార వేతనాలకు ఈ నెల14 వరకు ఎస్సీ విభాగంలో 3,429, ఎస్టీలు 2,078, బీసీలు 8,192, మైనార్టీలో 1,062, ఈబీసీలో 205 మొత్తం 14,967 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**యాదాద్రి భువనగిరి జిల్లాలో రెన్యువల్, ఫ్రెషర్ విద్యార్థుల దరఖాస్తుల వివరాలు**

2023-24 విద్యా సంవత్సరంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో అన్ని విభాగాల్లో రెన్యువల్ విద్యార్థులు 10,768 మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ఈ నెల14 వరకు 7,708 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ విభాగంలో 1,994 మందికి గాను 1,785 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీలో 770 మందికి 315 మంది, బీసీ సంక్షేమ శాఖలో 6,452 గాను 5,341 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 3,060 మంది రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్నది.

**యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫ్రెషర్ విద్యార్థుల దరఖాస్తులు**

జిల్లాలో ఫ్రెషర్ ఉపకార వేతనాలకు ఈ నెల 14 వరకు ఎస్సీ విభాగంలో 1,545 మంది, ఎస్టీలు 516 మంది. బీసీలు 4,501, మైనార్టీలు 409, ఈబీసీలు 331 మొత్తం 7,302 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**సూర్యాపేట జిల్లాలో రెన్యువల్, ఫ్రెషర్స్ విద్యార్థుల దరఖాస్తుల వివరాలు**

2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలో అన్ని విభాగాల్లో రెన్యువల్ విద్యార్థులు 17,059 మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ఫిబ్రవరి 14 నాటికి 13,022 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ విభాగంలో 4,027 మందికి గాను 3,352 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీల్లో 2,840 మందికి 2,072 మంది, బీసీ సంక్షేమ శాఖలో 8,466 గాను, 6,786 మంది విద్యార్థులు, ఈబీసీ విభాగంలో 812 మందికి గాను 616 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అన్ని విభాగాల్లో ఇంకా 4,037 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నది.

### ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

చివ్వెంల/పెన్‌పహాడ్/సూర్యాపేట రూరల్/తుంగతుర్తి/మునగాల/మేళ్లచెర్వు/నేరేడుచర్ల : జిల్లాలోని పలు మండలాల అభివృద్ధి అధికారులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చివ్వెంల ఎంపీడీఓగా సీహెచ్ సంతోష్‌కుమార్, పెన్‌పహాడ్ ఎంపీడీఓగా వెంకటేశ్వర్‌రావు, సూర్యాపేట మండల ఎంపీడీఓగా జి.బాలకృష్ణ, తుంగతుర్తి ఎంపీడీఓగా కె.శేషుకుమార్, మునగాల ఎంపీడీఓగా రమేశ్ దీన్ దయాళ్, మేళ్లచెర్వు ఎంపీడీఓగా ఖాజా అజ్గర్‌అలీ, నేరేడుచర్ల ఎంపీడీఓగా సోమసుందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు, పూలమాలతో వారికి స్వాగతం పలికారు.

### సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐగా సాయిరాం

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 14 : సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా సాయిరాం బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేసేందుకు కృషి చేస్తానన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## ముండ్ల పొదల్లో పసికందు

- ఏడుపు విని కాపాడిన స్థానికులు

మఠంపల్లి, ఫిబ్రవరి 14 : అప్పుడే పుట్టిన పసి పాపను ముండ్ల పొదల్లో వదిలి వెళ్లారు. ఈ ఘటన మండలంలోని మట్టపల్లి పునరావాస కేంద్రం సుల్తాన్‌పురం తండా వద్ద బుధవారం జరిగింది. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పురంతండా శివారులో కంప చెట్లలో పసి పాపను గుర్తించిన స్థానికులు తండాకు చెందిన అంగన్‌వాడీ వలంటీర్ ఉమకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించిన ఆమె 108 వాహనం ద్వారా శిశువును మఠంపల్లి ప్రభుత్వ దావాఖానకు తరలించింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శరీర భాగాల్లో అక్కడక్కడా ముండ్లు గుచ్చుకోవడంతో పరీక్షల కోసం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

శిశువు దొరికిన స్థలం ఆంధ్రా, తెలంగాణకు సరిహద్దు కావడంతో పాపను ఇక్కడకు చెందిన వారు వదిలేశారా? లేక ఆంధ్రా నుంచి ఇక్కడ వదిలేసి వెళ్లారా అనేది తెలియాల్సి ఉన్నది.

పాపకు వైద్య పరీక్షల అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి సాయి, వంశీకు అందజేసినట్లు తెలిపారు.

## హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనారవి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14 : హుజూర్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 2024-25 బడ్జెట్ సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణ ఆదాయం, మార్కెట్ ఫీజు, ఎంక్రోచ్‌మెంట్ ఫీజు, నల్లా పన్నులు, లైసెన్స్ ఫీజులు, ఇతర ఆదాయాలు, ప్రభుత్వ గ్రాంట్లు, డిపాజిట్ల ద్వారా ఆదాయం రూ.21.45 కోట్లు ఉండగా సాధారణ పరిపాలన, సిబ్బంది జీతభత్యాలు, ఇంజినీరింగ్, నీటి సరఫరా, శానిటేషన్, ప్రజారోగ్య కార్మికులు, పట్టణ ప్రణాళిక, గ్రీన్ బడ్జెట్, డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.21.45 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావు

ఎంపీపీ పద్మాసైదేశ్వర్‌రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 14 : రానున్న వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొట్టె పద్మా సైదేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాలి

- ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున్‌రెడ్డి
- 16న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు

బొడ్రాయిబజార్ : ఎస్‌కేఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 14 : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరుగనున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఎస్‌కేఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ సిఫారసులను ప్రధాని మోదీ బుట్ట దాఖలు చేశారని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ కూలీలకు అన్యాయం చేస్తుందన్నారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ మందారి డేవిడ్‌కుమార్, నెమ్మాది వెంకటేశ్వర్లు, బొడ్డు శంకర్, మట్టిపల్లి సైదులు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య ఆధ్వర్యంలో తుంగతుర్తిలో బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గుగులోతు రాజారాం, సీఐటీయూ నాయకులు బుర్ర శ్రీనివాస్, ఇఫ్టూ కాసర్ల దుర్గయ్య, అరుణోదయ జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకుడు బొంకూరి శ్యామ్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి పిలుపునిచ్చారు. మండలంలోని అనాజిపురం గ్రామంలో వ్యవసాయ కూలీలకు సమ్మె కరపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు లక్కపాక ముత్తయ్య, డాక్టర్ వెంకన్న, నందిపాటి జానయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

గరిడేపల్లి : రేపు జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఎంఎస్‌భవన్‌లో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు పోకల వెంకటేశ్వర్లు, యాకూబ్, ఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్, ఏఐవైఎఫ్ మండలాధ్యక్షుడు సైదులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని కొండాపురం, మాధవగూడెం, బేతవోలు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జె నరసింహారావు ఆధ్వర్యంలో ఇంటింటికీ బంద్ విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేటి రాములు, వీరస్వామి, మైబెల్లి పాల్గొన్నారు.

## 18 నుంచి జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

- గడ్డిపల్లి మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రావు

పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల అరవింద మాతా ధ్యాన మందిరం 52వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 18 నుంచి 22 వరకు గడ్డిపల్లిలో నిర్వహించే జాతీయ స్థాయి మహిళా కబడ్డీ ఇన్విటేషన్ పోటీలను జయప్రదం చేయాలని గ్రామ మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం గడ్డిపల్లి గ్రామంలో క్రీడలకు సంబంధించిన కరపత్రంను నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షులు రామినేని భూలోకరావు, రాంచందర్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని 12 రాష్ట్రాలకు చెందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు సహకరిస్తున్న తెలంగాణ ఒలింపిక్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బచ్చు ఉపేందర్, మేకల వెంకటేశ్వర్లు, బచ్చు రమేశ్, రామినేని దిలీప్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### డాక్టర్ ఏ.ఎస్.రావు పరీక్షలో 'జయ' విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 14 : ఐఐటీ ఫౌండేషన్‌కు కొలమానంగా పరిగణించబడుతున్న డాక్టర్ ఏ.ఎస్.రావు అవార్డ్ కౌన్సిల్ 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఫైనల్ లెవల్‌లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని షేక్ నేహ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్‌తో పాటు 13 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ బుధవారం తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

## నేడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 14 : స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బొమ్మగాని ధర్మభిక్షం జయంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, మేధావులు, యువజనులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రేగటి లింగయ్య, నాయకులు ఐతరాజు లింగయ్య, రేగటి వెంకటేశ్వర్లు, పొదిల వెంకటమ్మ పాల్గొన్నారు.

## 20 వరకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ

- మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం తాపిస్తున్న వైద్య సిబ్బంది

నూతనకల్, ఫిబ్రవరి 14 : 9 నెలల పిల్లల నుంచి 5 సంవత్సరాల పిల్లల వరకు నేటి నుంచి 20వ తేదీ వరకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేస్తున్నట్లు మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేసి మాట్లాడారు. 9 నెలల నుంచి ఏడాది పిల్లలకు 1 ఎంఎల్, ఏడాది నుంచి ఐదేండ్ల పిల్లలకు 2 ఎంఎల్ విటమిన్ ఏ ద్రావణం అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్రావణాన్ని తప్పక తాపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తారమ్మ, మాణిక్యమ్మ, వెంకట్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

### సామూహిక అక్షరాభ్యాసం

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 14 : వసంత పంచమిని పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో బుధవారం బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేశ్, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ దాచేపల్లి సుధీర్, తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న బాల బాలికలు

### సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 14 : సూర్యాపేట పట్టణ మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్ సూర్యాపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ జీకేడీ ప్రసాద్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరి, ఆర్ఐ శివరాంరెడ్డి, మెప్మా పీడీ రమేశ్‌నాయక్, డీఈ సత్యారావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, మున్సిపల్ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

### కోదాడ మున్సిపల్ కమిషనర్‌గా రమాదేవి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 14 : కోదాడ మున్సిపల్ కమిషనర్‌గా అంబటి రామాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ బదిలీపై చౌటుప్పల్ వెళ్లారు. మున్సిపల్ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఈ రమాదేవి, ఆర్‌ఓ విజయేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, మేనేజర్ రాబిన్, హమీద్ పాల్గొన్నారు.

### సూర్యాపేట, కోదాడ డీఎస్పీలుగా రవి, శ్రీధర్‌రెడ్డి

సూర్యాపేట సిటీ/కోదాడ టౌన్, ఫిబ్రవరి 14 : సూర్యాపేట డీఎస్పీగా రవి నియమితులయ్యారు. డీసీఆర్‌బీలో డీఎస్పీగా ఉన్న ఈయన సూర్యాపేట డీఎస్పీగా నియమితులయ్యారు. ప్రస్తుత డీఎస్పీ నాగభూషణంను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే కోదాడ డీఎస్పీగా మామిళ్ల శ్రీధర్‌రెడ్డి బుధవాం బాధ్యతలు స్వీకరించారు.

### రైతు వేదికలను వినియోగంలోకి తేవాలి

- సీపీఐ నాయకుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 14 : రాష్ట్ర వ్యాప్తంగా వృథాగా ఉన్న రైతు వేదికలను వినియోగంలోకి తేవాలని సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ హయంలో నిర్మించిన రైతు వేదికలను అలంకారప్రాయంగా మార్చకుండా వాటిని నిరుపేదల శుభకార్యాలకు తక్కువ కిరాయితీ అద్దెకు ఇవ్వాలని పేర్కొన్నారు.

### 'అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి'

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందించాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ధనవంతులకు, మధ్య తరగతికి చేరినంతగా పేదలకు చేరడం లేదన్నారు. ఆధార్ కార్డుతో ఆస్తులను, బ్యాంక్ అకౌంట్లు, పాన్ కార్డును అనుసంధానం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ ఆర్.లింగయ్య, అబ్దుల్ కరీం, ఆవుల నాగరాజు, ఎన్.వెంకట్‌యాదవ్, సీహెచ్.నర్సయ్య, పి.వీరన్న పాల్గొన్నారు.

నేరేడుచర్లలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

### నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

నేరేడుచర్ల, ఫిబ్రవరి14 : నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.ప్రకాశ్, ఎ.సరితను వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ, వనితా క్లబ్ నాయకులు లక్ష్మణ్, నటరాజ్, పుల్లయ్య, గోపాలకృష్ణ, కోటేశ్వర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 29న నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

నడిగూడెం, ఫిబ్రవరి 14 : నడిగూడెం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌పై ఈ నెల 29న అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించనున్నారు. అవిశ్వాస తీర్మానానికి డైరెక్టర్లు హాజరు కావాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా సహకార అధికారి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘంలో అవినీతి, అక్రమాలు జరిగాయని, చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరుతూ గతేడాది డిసెంబరు 27న డైరెక్టర్లు డీసీఓకు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో జనవరి 20న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ పాలకవర్గ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. అయితే సంఘం చైర్మన్ పుట్టా రమేశ్ హైకోర్టు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తీసుకు రావడంతో ప్రత్యేక సమావేశం నిలిచిపోయింది. మరోసారి ఈ నెల 29న చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు డైరెక్టర్లకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

సూర్యాపేట రూరల్ : లింగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

### ఆర్థిక సాయం

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 14 : మండలంలోని ఇమాంపేట గ్రామానికి చెందిన వగ్గు లింగరాజు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. లింగరాజు కుటుంబానికి స్నేహితులు బుధవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శ్రీనివాస్, నకిరేకంటి బాలకృష్ణ, జిల్లా సోమయ్య పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మిడిసినమెట్ల కృష్ణయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి అరవిందరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గండ్ర సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, శ్రీనివాస్, చంద్రయ్య, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, సామ్రాట్, రాంబాబు, కార్తీక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**ప్లాట్ అమ్మబడును**

నల్లగొండ పట్టణంలో సాగర్ హైవేకి అతి దగ్గరగా జాలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ ప్రక్కన వున్న పడమర ఫేస్ 215 చ||గజముల ప్లాట్ అమ్మబడును. సంప్ర||9963729593.

NLG-

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం

నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059